క్లుప్తంగా

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మేనేజర్ ఖలీమొద్దీన్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని మల్కాపూర్‌లో మాట్లాడుతూ.. రైతులకు డీసీసీబీ ద్వారా అందిస్తున్న బీమా పథకాలతో పాటు రైతులకు అందిస్తున్న రుణాలను వివరించారు. రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ రవీందర్, డైరెక్టర్లు సునీత, అశోక్ తదితరులు ఉన్నారు.

ధాన్యం విక్రయాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హరిప్రసాద్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ధాన్యం విక్రయాల విషయంలో రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ ఇబ్రహీంపూర్, బోనాల్, మక్కరాజీపేట, చందాయిపేట గ్రామాల్లో రైతులు ధాన్యం తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. దీనికోసం కోత సమయంలోనే తాలు రాకుండా చూడాలని, తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా ఆరబెట్టాలన్నారు. తగిన జాగ్రత్తలతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే, త్వరగా తూకం వేసుకునేందుకు వీలుంటుందన్నారు. ఆయా గ్రామాల ఏఈఓలు, ఐకేపీ సిబ్బంది స్వామి, అంజ్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

సహకార నిధి డిపాజిట్ పథకంలో చేరండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అభినవ్

శివ్వంపేట(నర్సాపూర్): సహకార నిధి డిపాజిట్ పథకంలో చేరాలని నర్సాపూర్ డీసీసీబీ మేనేజర్ అభినవ్ అన్నారు. బుధవారం శివ్వంపేటలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25లోపు డిపాజిట్ స్కీంలో చేరేందుకు అవకాశం ఉందన్నారు. డీసీసీబీల ద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణాకర్, సీఈఓ మధు రైతులు పాల్గొన్నారు.

ఆనకట్టపై గ్రిల్ ఏర్పాటు


ఘనపురం ఆనకట్టపై ఏర్పాటు చేసిన గ్రిల్

పాపన్నపేట(మెదక్): ఘనపురం ఆనకట్టపై ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన గ్రిల్‌ను మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సుమారు 10 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఆనకట్టపై ప్రమాదాలు జరగకుండా గ్రిల్‌తో కూడిన గేట్‌ను ఏర్పాటు చేసినట్లు ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసుల సూచనల కనుగుణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రిల్ వద్ద ఏర్పాటు చేసిన తలుపును అవసరాన్ని కనుగుణంగా మూసి వేస్తామన్నారు. అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

నర్సాపూర్: కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నందున ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్నట్లు సునీతారెడ్డి ప్రకటించారు. రెడ్డిపల్లికి చెందిన మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నవీన్, అంజనేయులు, నితిన్, పవన్, ప్రశాంత్, మనోహర్ తదితరులు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని ఆమె వివరించారు.

వైభవంగా బోనాల ఊరేగింపు


గౌతాపూర్‌లో బోనాలతో మహిళలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్ గ్రామంలో బుధవారం బట్టెమ్మతల్లికి కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు శివసత్తుల శిగాలు, చిన్నారుల నృత్యాలతో బోనాలు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు మాజీ శంకరయ్య, రామకిష్టయ్య, బాల్‌రాజ్, వీరయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో యువకులు, నాయకులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.


టేక్మాల్(మెదక్): కుసంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


పెద్దశంకరంపేటలో బైక్ ర్యాలీ


నర్సాపూర్: ఛత్రపతి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్


పాపన్నపేట(మెదక్): ఆరెపల్లిలో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేటలో..


వెల్దుర్తిలో..


కౌడిపల్లి(నర్సాపూర్): మహమ్మదనగర్‌లో..


చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో..


మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


మనోహరాబాద్(తూప్రాన్):జీడిపల్లిలో..

కనీస వసతులు కల్పించండి


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం కనీస వసతులు కల్పించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మహేశ్‌దత్ ఎక్కా అన్నారు. ఆయన బుధవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో, కౌడిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించాలని, పోలింగ్‌కు రెండు రోజుల ముందు పోలింగ్ స్టేషన్ల భవనాలు స్వాధీనం చేసుకొని పరిసరాలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అవసరం మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా స్థానిక ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగంలు పోలింగ్ స్టేషన్ల వివరాలు పరిశీలకుడికి వివరించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని చీకోడ్ లింగాయపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఒక్కరోజు డీఈఓగా మహేశ్, ఎంఈఓగా రుత్విక్ తేజ, హెచ్‌ఎంగా నందిని, టీచర్లుగా చంద్రకళ, కీర్తి మహి, విజయలక్ష్మి, రాహుల్, రాకేష్, అఖిల్, అరుణ్ జగదీష్, సుషాంత్, అన్వేష్, పోచయ్య, దీక్షిత్, అరుణ్ నాయక్, అఖిల్ నాయక్ తమ విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కిషన్, అంజనాచారి, ఆనందం, పద్మ మౌనిక, నవీన్ కుమార్ పాల్గొన్నారు.


చీకోడ్ లింగాయపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

చెత్తచెదారంతో దోమల బెడద


అంబాజిపేటలో పేరుకుపోయిన చెత్త

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేట గ్రామంలో చెత్త పేరుకుపోయింది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వీధులలోని చెత్తను తొలగించాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారం ఉండడంతో దోమల బెడద పెరుగుతుందన్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకుపోయినా.. స్పందించడంలేదన్నారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో చెత్తను డంప్‌యార్డుకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ముగ్గురి అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): బొమ్మ బొరుసు(చిత్తు బొత్తు) ఆట ఆడుతున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ చెప్పిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని కల్లు దుకాణం పక్కన ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో బొమ్మ బొరుసు ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడిచేసి చిన్నశంకరంపేటకు చెందిన రఘుపతి, ప్రకాష్, అనిల్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూ.490 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

మార్కుల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల అంతర్గత మార్కులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంగాబాయి ఆధ్వర్యంలో మార్కుల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయ్, సంధ్యారాణి, రాజులుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు జగన్‌లాల్, పెంటాగౌడ్, విజయేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సంధ్యారాణి, సునీత పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరికి గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రెండు బైకులు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన నార్సింగి మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై మల్లన్న కమాన్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నర్సంపల్లికి చెందిన రాజు తీవ్రంగా గాయపడ్డారు. మరో వ్యక్తి కూడా గాయపడగా చికిత్స నిమిత్తం రామయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ నాయకులతో కలిసి పలువురు లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ మల్లయ్య అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

సిమెంట్ రోడ్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్


పాడైన సీసీ రోడ్డును తవ్వి కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డులో నిర్మించిన సీసీరోడ్డులో నాణ్యత కొరవడిందని ఈనెల 8న సాక్షిలో నెల రోజులకే కంకర తేలిన సీసీరోడ్డు అనే కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. గతంలో సీసీరోడ్డు ఏర్పాటు చేయగా, పాడైన రోడ్డును తవ్వి మళ్లీ సీసీరోడ్డు వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పాడైన రోడ్డును తవ్వి, కొత్త రోడ్డు పనులు మంగళవారం రాత్రి వరకు పూర్తి చేశారు. నాణ్యత లేని రోడ్డును తొలగించి మళ్లీ కొత్త రోడ్డు వేసేలా సాక్షిలో కథనం రావడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


వెల్దుర్తి(తూప్రాన్): ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


పాపన్నపేట(మెదక్): అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్ఐ సంగన్న తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై, డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలని పోలీసులు అన్నారు. ఈ మేరకు బస్టాండ్ చౌరస్తాలో ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. పోలీస్ సిబ్బంది, సాయి యశ్వంత్, మాణిక్యం, కృష్ణాగౌడ్, సలావొద్దీన్ పాల్గొన్నారు.

అపరిచితుల ఫోన్లు వస్తే జాగ్రత్తగా ఉండాలి

పాపన్నపేట(మెదక్): సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సంగన్న అన్నారు. బుధవారం పాపన్నపేట మెయిన్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి ఫోన్లు వస్తే జాగ్రత్తగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఓటీపీలు అడిగితే చెప్పొద్దని కోరారు. పిన్ నంబర్లను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎవరైన ఫోన్ చేసి, డిజిటల్ అరెస్టుల గురించి చెపితే నమ్మద్దని సూచించారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి దగ్గరి వారికి ప్రమాదాలు జరిగినట్లు, సీరియస్‌గా ఉన్నట్లు ఫోన్లు వస్తే నమ్మద్దని, సంబంధీకులకు ఫోన్‌చేసి నిర్ధారించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ విద్యార్థినులు, మహిళలు, పోలీసులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


నోట్ బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన శేరిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తు సమాచారంతో సెలవు పెట్టాలని అన్నారు. సంబంధిత గ్రూపులో సమాచారం షేర్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా పాఠశాల పర్యవేక్షణకు వచ్చిన విషయం తెలుసుకొని, ఆదరాబాదరాగా సెలవు మెసేజీలు పెట్టడం సరికాదన్నారు. ముందుగా పాఠశాల ఇన్‌చార్జి బాధ్యతలు ఇతర టీచర్లకు అప్పగించి వెళ్లాలని తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఈ విషయమై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల నోట్ పుస్తకాల్లో అనేక తప్పులు ఉన్నా.. టీచర్లు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ చోటు చేసుకున్నా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థి స్థాయికి తగ్గ సామర్థ్యాలు నేర్పించే బాధ్యత టీచర్లదే నన్నారు.

వేలంపాట చిన్నఘనాపూర్‌లో నిర్వహించండి


వినతిపత్రం అందిస్తున్న చిన్నఘనాపూర్ గ్రామస్తులు

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల జాతర సందర్భంగా మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి ఏడుపాయల వనదుర్గ దేవి సన్నిధికి వెళ్లే మార్గమధ్యలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలం వేలంపాటను చిన్నఘనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరపాలని అక్కడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. అధికారులు ఇప్పటికే పార్కింగ్ వేలంపాటను మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్నట్లు మంగళవారం ప్రకటన విడుదల చేయడం తెలిసిందే. అయితే ప్రస్తుతం పార్కింగ్ ఏర్పాటు చేస్తున్న స్థలం చిన్నఘనాపూర్ గ్రామ శివారు పరిధిలోనిదని, పోతంశెట్టిపల్లికి ఎలాంటి సంబంధం లేదన్నారు. డీఎల్పీఓ ఈ విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సందీప్, లక్ష్మీపతి, రాజాగౌడ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు నలుగురు అదృశ్యం

ఒకేరోజు నలుగురు అదృశ్యమయ్యారు. వేర్వేరు కారణాలతో బయటకు వెళ్లిన వ్యక్తులు ఇళ్లకు రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షాప్‌కు వెళ్తుతున్నట్లు ఇంట్లో చెప్పి..


అల్తాఫ్

చేగుంట(తూప్రాన్): షాప్‌కు వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంటలో చోటు చేసుకుందని ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట పట్టణానికి చెందిన అల్తాఫ్ చేగుంటలోని సంగీత మొబైల్స్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం షాపుకు వెళ్తుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన అల్తాఫ్ రాత్రి వరకు ఇంటికి రాలేదు. అతడి సోదరుడు హర్షద్ బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదు. దీంతో చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నశంకరంపేటలో మహిళ..


యాదమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): మహిళ అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... మండల కేంద్రానికి చెందిన మేకల యాదమ్మ(42) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. మూడు రోజులుగా బంధువుల వద్ద వెతికినా.. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడైన ఆచూకీ లభిస్తే సమాచారం అందించాలన్నారు.

కోచింగ్ కోసం అని వెళ్లి..


అనిల్‌కుమార్

మనోహరాబాద్(తూప్రాన్): యువకుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మయ్యాడి సతయ్య చిన్న కుమారుడు అనిల్‌కుమార్ (28) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 7న ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాగా అతని ఫోన్ కలవకపోవడంతో కుటుంబసభ్యులు స్నేహితులను, చుట్టాలను తెలుసుకున్న జాడ తెలియకపోవడంతో ఆందోళన చెందారు. అతని అన్న నవీన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

కుటుంబ తగాదాలతో..


లక్ష్మి

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయ భూమి విషయంలో కుటుంబంలో ఏర్పడిన తగాదాలతో మనస్థాపం చెంది వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని ఉప్పులింగాపూర్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ లక్ష్మీ భార్త రవితో గొడవ పడి, మంగళవారం మధ్యాహ్నం నారాయణపూర్ గిరిజన హాస్టల్‌లో చదువుకుంటున్న కూతురు దగ్గరికి ఇంటి నుంచి బయలు దేరింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని సూచించారు.